# మతిమంతుని మంత్రాంగం....

రచన: తెన్నేటి రాధాకృష్ణమూర్తి.

చాలకాలం క్రిందట జరిగినసంగతి. అప్పుడు తిరుచునాపల్లిని దుష్టకాముడనేరాజు పాలిస్తూఉండేవాడు. పేరు ఏలాంటిదో బుద్ధి అలాంటిదే. పొరుగు పచ్చన గిట్టేదికాదు.

ఆ రాజుగారిదగ్గర మతిమంతుడనే మంత్రి ఉండేవాడు. మంత్రిచాలమంచివాడు. ఎవరికి ఎట్టి కష్టమువచ్చినా యథాశక్తి సహాయము చేసేవాడు.

సాధారణంగా రాజుగారు యేవేవో దురాలోచనలుచేసి కష్టాలు తెచ్చిపెట్టడం, ప్రజలందరూ బావురుమంటూ ప్రధానిగారింటిచుట్టూ మూగడం, సచివుడు వాటినన్నింటిని సాధించి ప్రజలకష్టాలు బాపడం పరిపాటైపోయింది ఆరాజ్యంలో.

గ్రీష్మఋతువుపోయి వర్షఋతువు వచ్చింది. కావేరీనది కలకలమంటూ సంపూర్ణ యౌవనముతో శోభిస్తూ తనప్రియుడైన సాగరుని దరిజేరుటకు సాగిపోతున్నాది.

ఒకనాటివిషయము: రాజుగారు షికారు పోయారు కావేరినదికి. మంత్రి, సేనాధిపతి మొదలగు ప్రధానోద్యోగులు వెంటనున్నారు. రాజుచూసాడు. నదిఒడ్డు రాసుకుపారుతున్నది. ఏదో దురాలోచన రాజుమనస్సులో పొడచూపినది. మంత్రిని ప్రశ్నించాడు. మంత్రిగారూ! మన యీనది యెటు ప్రవహించుచున్నది. మంత్రి సమాధానమిచ్చాడు తంజావూరు దిక్కునకని. అన్నాడురాజు "చూడండి మంత్రిగారూ! నదినిండా యెంత నీరున్నదో! మన నీరంతా యిలాగ ప్రవహించి తంజావూరు పోతే ఆ ఊరు ప్రజలు యీనీటితో పంటలు పండించుకుంటున్నారు. మన కప్పుడప్పుడు నీటి యిబ్బంది కలుగుతున్నాది. కాబట్టి యీనీరు తంజావూరు పోకుండా నదికడ్డంగా గట్టు వేయించండి" అని హుకుమ్ జారీచేసేడు.

రాజుగారిమాటలువిని మంత్రిఅనుకున్నాడు "ప్రమాదం వచ్చిపడిందిరా" అని. కాని రాజుగారి మాటలకెదురాడే సాహసం లేదు ఎవ్వరికిని. ముందు ఆజ్ఞ పాలించవలసిందే. వెనుకనుండి సర్దుకోవల్సిందే.

రాజాజ్ఞప్రకారం కావేరీనదికి అడ్డుగగట్టు వేయబడింది. తనదారినిపోయే ప్రాచుకు ఆటంకం కలిగిస్తే విజృంభించే విధాన కావేరినది ఒడ్డుకెక్కింది. ఒడ్డుకెక్కి ఊరకుంటుందా? పట్టణములో ప్రవేశించింది. ఇళ్ళల్లో దూరింది. పడకటిల్లు పట్టింది. వంటింట్లోవాలింది. అంతా జలమయం చేసివేసింది.

ప్రజలంతా ఘొల్లుమన్నారు. "పదండంటే పదండి. మంత్రిగారే దీని కేదేని ఉపాయం చెప్పాలి" అని మంత్రిగృహము చేరేరు. మంత్రిగారితో మొఱ్ఱపెట్టుకున్నారు. విన్నాడు మంత్రి వారిసంగతంతా. ఏదో దీర్ఘాలోచన చేసేడు. అన్నాడు ప్రజలతో. "మీరిండ్లకు పొండి. మీబాధ తప్పించే ఉపాయం ఆలోచిస్తాన"ని వారిని పంపివేసేడు. ప్రజలందరు యిండ్లకు మరలేరు.

ఆకాలంనాటి కింకా మనదేశానికి గడియారములు దిగుమతికాలేదు. రాజుగారి కోట వద్ద మాత్రము ఒకసిపాయి గంటలు కొడుతూ ఉండేవాడు. దాన్నిబట్టి ప్రజలకు సమయ జ్ఞానము కలిగేది.

మంత్రి గంటలుకొట్టే ఆ సిపాయిని పిలిపించేడు. సిపాయి వచ్చేడు. మంత్రి సిపాయితో అన్నాడు. నీవు ప్రతిదినము ఎన్నిగంటలయితే అన్నిగంటలు కొడుతున్నావు. ఈ రాత్రి మాత్రమట్లుగాక అరగంట గంటగాభావించి గంటలు కొట్టాలి. అంటే ఒంటిగంటకు ఒకగంటా, ఒంటిగంటన్నరకు రెండు, రెండు గంటలకు మూడు, మూడుగంటలకు ఐదు ఇట్లు; తెలిసిందా? సిపాయి చిత్తమని వెళ్ళిపోయి మంత్రిగారి ఆజ్ఞాపాలన చేయసాగేడు!

రాత్రిఅయింది. ప్రజలంతా భయంతో ప్రాణాలు చేతిలోపెట్టుకుని జాగరం చేస్తున్నారు. రాజుగారు మాత్రం తన అంతఃపురంలో హంసతూలికాతల్పం మీద కలలు గాంచుతున్నారు. ప్రభువులుకాదు మరి?

సిపాయి మంత్రిగారు చెప్పినప్రకారం గంటలు కొడుతున్నాడు. పది, పదకొండు, పన్నెండు, ఒంటిగంట, రెండుగంటలు, మూడుగంటలు, నాల్గుగంటలు, ఐదుగంటలు.

ఐదవగంట వినబడడంతోనే వైతాళికులు తమ గీతములు ప్రారంభించేరు. మంగళ వాద్యములు మ్రోగేయి. ఎందుకనుకున్నారు. రాజుగారు నిద్రనుండి లేపడానికి. గుఱ్ఱం గ్రుడ్డిదైనా దానాకి లోటుండదు కదూ!

రాజులేచేడు. ఆరు గంటలైంది. కానీ ఎక్కడా వెల్తురులేదు. ఏమిటా కారణమని ఆలోచించేడు. నల్దిక్కులు చూసేడు. గాఢమైన చీకటి క్రమ్మకొనిఉంది. దిక్కులైన తెల్లవారలేదు. మంత్రిగార్ని పిలిపించి కారణమడిగేడు!

మంత్రి అన్నాడు: "ఏమోరాజా! నేనూ అదే ఆలోచిస్తున్నాను. చాలసేపటి క్రిందట ఆరుగంటలు వినబడ్డాయి. ప్రతిరోజు యీవేళకు బారెడు ప్రొద్దెక్కేది. ఈ రోజు మాత్రం దిక్కులైనా తెల్లవారలేదు. కానీ దీనికో కారణం ఉండి ఉంటుంది. అదిఏమిటంటే మన యీ కావేరినది తూర్పుకు పారుతున్నాది. తంజావూరు మనకు తూర్పునఉంది. మనము తూర్పునకు పోతున్న కావేరి నీటి నడ్డేమని ఆ తంజావూరు ప్రజలు తూర్పునుండి మన పడమటి దిక్కునకువచ్చే సూర్యుడ్ని ఆపి ఉంటారు! సూర్యుడు తూర్పునుండి పడమటకు వస్తాడుకదూ ప్రభూ!"

రాజన్నాడు: "ఐతే మనకు మరి సూర్యుడు రాడా? వెల్తురుండదా?"

మంత్రి సమాధానం చెప్పేడు. "ఏమో ప్రభూ! తంజావూరు ప్రజలువదలిపెట్టితేవస్తాడు. మనం నీరాపితే వారుసూర్యుణ్ని ఆపేరు."

రాజు నాల్గుదిక్కులు చూసేడు. గాఢాంధకారం ఘనీభవించిఉంది. ఆచీకటి దుర్భరమనిపించిందన్నాడు మంత్రితో. "ఐతే మరి తంజావూరువాళ్లు సూర్యుడ్ని ఎప్పుడు వదుల్తారు?"

మంత్రిచెప్పేడు: "ఏమోతెలియదురాజా! బహుశ వారికిపోయేనీటిని మనంవదుల్తే వారు మనకువచ్చే సూర్యుణ్ణి వదుల్తారనుకుంటా."

రాజాలోచించేడు. ఏలాగో ఒకలాగు సూర్యుణ్ణి రప్పించాలి. వెల్తురంతటారావాలి. లేకపోతే చీకటి చాలా భయంకరంగాఉంది. మంత్రితో చెప్పేడు. "చూడండి మంత్రిగారూ! మీరు వెంటనేపోయి కావేరికివేసిన గట్టుకొట్టించి తంజావూరు వాళ్ళకి కావలసిన నీరు పంపించండి. వారుమాత్రంసూర్యుణ్ణివదలిపెట్టాలి."

"చిత్తం, ప్రభూ! శలవు పుచ్చుకుంటాన"ని మంత్రి మరలేడు.

వెంటనే ప్రధాని కూలివాళ్ళను యేర్పాటుచేసి దివిటీలసహాయంతో గట్టు కొట్టించడం ప్రారంభించేడు. మామూలు ప్రకారం తెల్లవారుఝాము కావచ్చింది. గట్టు తెగగొట్టబడ్డాది. "కదలికే కదు హోయి" అని పాడుకుంటూ మరల కావేరినది తనమార్గం పట్టింది. సూర్యుని వెల్తురు పొడచూపింది.

ప్రజలంతా మంత్రిగారు పన్నిన యుక్తికి చాలాసంతోషించేరు. ఆయురారోగ్య సౌభాగ్యములు కల్గించి మా మంత్రిగారిని చిరంజీవిగా మనుపవల్సిందని అందరూ ఏకగ్రీవంగా భగవంతుని ప్రార్థించేరు.